అభివృద్ధిని చూసి ఆదరించండి

గెలిపిస్తే సేవకుడిగా పనిచేస్తా
- 'గ్యారంటీ'లను నమ్మి గోసపడొద్దు
- వ్యవసాయాన్ని పండుగలా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే
- బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్

కొండాపూర్(సంగారెడ్డి): గత పదేళ్లలో తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని ఆ పార్టీ అభ్యర్థి చింతా ప్రభాకర్ ఓటర్లను విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని మల్కాపూర్, గుంతపల్లిలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్‌కు మహిళలు, యువకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ పాలన ఎలా ఉంది? ప్రస్తుత బీఆర్‌ఎస్ పాలన ఏవిధంగా ఉందో ప్రజలు ఆలోచించాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోతలు, వలసలతో ఆరిగోసలు పడిన విషయం మర్చిపోవద్దన్నారు. ఇటీవల కర్ణాటకలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తెలంగాణలో కూడా పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే కర్ణాటక పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. కర్ణాటకలో రైతులకు 5 గంటల కరెంట్ ఇస్తున్నారని, ఇక్కడ కూడా ఓటేస్తే కేవలం మూడు గంటలే కరెంట్ ఇస్తామని స్వయంగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని చెప్పారు. రైతుబంధు పంపిణీని అడ్డుకునేందుకు కాంగ్రెస్ చేసిన చర్యలు ఫలించలేదన్నారు. రైతులకు రైతుబంధు నగదు ఇవ్వాలని ఈసీ తీసుకున్న నిర్ణయం కాంగ్రెస్‌కు చెంప పెట్టులాంటిదన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న బీఆర్‌ఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు విఠల్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, పాండురంగం, జగదీశ్వర్ రాజు పాల్గొన్నారు.


కంది: బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్‌కు మద్దతు తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు


గుంతపల్లిలో చింతా ప్రభాకర్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు


సంగారెడ్డి టౌన్: అభివాదం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్, నాయకులు

నిండు మనసుతో ఆశీర్వదించండి

కంది(సంగారెడ్డి): నిండు మనసుతో ఆశీర్వదించి గెలిపించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ అన్నారు. కంది మండల కేంద్రంలో శనివారం దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ భవనాలను నిర్మిస్తానని హామీనిచ్చారు. టీఎస్‌ఎంఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, డీసీసీ బ్యాంకు వైస్‌చైర్మన్ మాణిక్యం, నాయకులు అశోక్, సుజాత, మందుల వరలక్ష్మి, యాదమ్మ, నందకిషోర్, దుర్గప్రసాద్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

చింతా ప్రభాకర్‌కు మద్దతు

సంగారెడ్డి: బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్‌కు మద్దతుగా సంగారెడ్డి పట్టణంలోని బైపాస్‌లో నాయీ బ్రాహ్మణ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సెలూన్ టూ సెలూన్ తిరుగుతూ కట్టింగ్, షేవింగ్ చేస్తూ ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు చరణ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే నాయీ బ్రాహ్మణలను గుర్తించిందన్నారు. హెయిర్ సెలూన్‌లకు ఉచిత కరెంటు, ఉచిత న్యూస్‌పేపర్, బీసీబంధు, డబుల్ బెడ్‌రూమ్‌లు, సంక్షేమ పథకాలు ఇచ్చారని గుర్తు చేశారు. మహిళా అధ్యక్షురాలు ఆకాశవేణి, సంఘం ఉపాధ్యక్షులు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి రాము, నాగభూషణం, అధ్యక్షుడు మాణిక్‌ప్రభు, దత్తాత్రేయ, వీరభద్ర అంజయ్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను గెలిపించండి

సంగారెడ్డి టౌన్: బీఆర్‌ఎస్ గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ అభ్యర్థి చింతా ప్రభాకర్ కోరారు. సంగారెడ్డి మండలం కులబ్‌గూర్ గ్రామ శివారులోని ఫంక్షన్ హాలులో పట్నం మాణిక్యం యువసేన ఆధ్వర్యంలో యువత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చింతా ప్రభాకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే జగ్గారెడ్డి గెలిచిన నాటి నుంచి మీ వాడకు ఎన్నిసార్లు వచ్చారో గుర్తుచేసుకోవాలన్నారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీఎస్‌ఎంఎస్ ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, డీసీసీబీ వైస్ చైర్మన్ మాణిక్యం, బీరయ్యయాదవ్, రాజేశ్వర్‌రావు దేశ్పాండే, నాయకులు రవితేజ, నరిన్ దేశ్పాండే తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి


కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్‌ను ఆశీర్వదిస్తున్న మహిళ

- జహీరాబాద్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా
- ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం
- బీఆర్‌ఎస్, బీజేపీలను నమ్మొద్దు
- కాంగ్రెస్ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్

జహీరాబాద్: కాంగ్రెస్‌తోనే అన్నిరంగాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్ అన్నారు. మొగుడంపల్లి మండల పరిధిలోని ఔరంగనాగర్, గుడ్‌పల్లి, మొగుడంపల్లి గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే జహీరాబాద్ నియోజకవర్గం రూపురేఖలను మార్చి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీనిచ్చారు. బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం కుంటుపడిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. జెడ్పీటీసీ నాగిశెట్టి రాథోడ్, నాయకులు మక్సూద్, ఎంజి రాములు, అర్షద్, గొని శివకుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఝరాసంగం(జహీరాబాద్): కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరుతూ ఝరాసంగంతో పాటు సిద్ధాపూర్, భోజ్యానాయక్ తండాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్ ఆధ్వర్యంలో చీలపల్లితండాకు చెందిన బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శంకర్‌పాటిల్, యువజన కాంగ్రెస్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌శంకర్ పాటిల్, నాయకులు ముల్తాని, ముక్తార్, సుభాష్, విష్ణువర్ధన్, బన్సిలాల్, ప్రేమ్‌సింగ్, వాచుజాదవ్, రాములు బానోత్, శివాజీరాథోడ్ పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిన చీలపల్లి తండావాసులు

ముమ్మరంగా ఇంటింటి ప్రచారం..

జహీరాబాద్: మొగుడంపల్లి, జహీరాబాద్ మండలాల్లో కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆ మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కో-ఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్ తదితర నాయకులు, కార్యకర్తలతో కలిసి హోతి(బి), ఆనెగుంట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. ధనాసిరి గ్రామంలో పీఏసీఎస్ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

మాక్ పోలింగ్ పరిశీలన

జహీరాబాద్: పట్టణంలోని విద్యాభారతి పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన నమూనా అసెంబ్లీ మాక్ పోలింగ్‌ను సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమూనా ఎన్నికల నిర్వహణను విద్యార్థులు చక్కగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని ఆకాంక్షించే మంచి నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాలమన్, న్యాయవాదులు పాండురంగారెడ్డి, మాణిక్‌పటేల్, విశ్వనాథ్, రుద్రయ్య, ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు స్నేహలత, శ్రీహరి, లక్ష్మి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ముచ్చర్ల, దౌల్తాబాద్‌లో పోలింగ్ కేంద్రాల పరిశీలన

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని ముచ్చర్ల, దౌల్తాబాద్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మెదక్ జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆయన వెంట ఎంపీఓ సువర్ణ, బీఎల్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

జిన్నారంలో..

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల, బొంతపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల పరిశీలకులు నిజాంజైభా పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్లకు ఏర్పాటుచేసిన వసతులను పరిశీలించారు. ఎన్నికల ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాభవానీ, ఆర్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పథకాల అమలులో ఆదర్శం

- బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం
- బీఆర్‌ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు


ఝరాసంగంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు

ఝరాసంగం(జహీరాబాద్): సంక్షేమ పథకాల అమలులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆదర్శంగా నిలిచిందని ఆ పార్టీ అభ్యర్థి మాణిక్‌రావు అన్నారు. ఝరాసంగం మండల కేంద్రంలో శనివారం స్థానిక నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుభీమా, రుణమాఫీ, దళితబంధు, డబుల్ బెడ్‌రూం, తదితర సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సీఎం కేసీఆర్ అన్నివర్గాలకు అండగా నిలిచారన్నారు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సీడీసీ చైర్మన్ ఉమాకాంత్‌పాటిల్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశం, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు జగదీశ్వర్, నాయకులు సంతోష్‌కుమార్‌పాటిల్, ఎజాజ్‌బాబా, జగదీశ్వర్ పాటిల్, సంగమేశ్వర్, శివశంకర్‌పాటిల్, కేతన్ చౌతాయి, సామెల్, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

జహీరాబాద్: పట్టణంలోని మూసానగర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు యాసిన్, ఖాలీద్ తదితరులు బీఆర్‌ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు సమక్షంలో పార్టీలో చేరారు. అదేవిధంగా ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన శేఖాపూర్ గ్రామానికి చెందిన జేఏస్‌ఆర్డ్ యజమాని జావీద్ తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఐడీసీ చైర్మన్ తన్వీర్, డీఆర్‌యూసీసీ సభ్యుడు షేక్‌ఫరీద్, నాయకులు తట్టు నారాయణ, శ్రీకాంత్‌రెడ్డి, మతిన్, ముర్తుజ, షమ, మచ్చేందర్, తాజొద్దీన్, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తే కష్టాలే!..

జహీరాబాద్ టౌన్: కాంగ్రెస్ వస్తే అన్నీ కష్టాలేనని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పురుషోత్తంరెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మాణిక్‌రావుకు మద్దతుగా పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో పస్తాపూర్ ఆర్టీసీ, డీడీఎస్ కాలనీ, మినీ మహీంద్ర కాలనీలో ప్రచారం నిర్వహించారు.


న్యాల్‌కల్: శంశల్లాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మాణిక్‌రావు


జహీరాబాద్ టౌన్: ఆర్టీసీ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న పురుషోత్తంరెడ్డి, నాయకులు

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

న్యాల్‌కల్(జహీరాబాద్): బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఆ పార్టీ అభ్యర్థి మాణిక్‌రావు అన్నారు. శంశల్లాపూర్, వడ్డి తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్మన్ తన్వీర్, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు రవిందర్, వైస్‌ఎంపీపీ గౌసోద్దీన్ నాయకులు భాస్కర్, నర్సప్ప, పాండురంగరావు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల గ్రామానికి చెందిన కందాడై అచ్యుతరామన్ ఆధ్వర్యంలో పలువురు యువకులు, ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు బీజేపీ అభ్యర్థి నందీశ్వర్‌గౌడ్ సమక్షంలో పార్టీలో చేరారు. నాయకులు యాదగిరి, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

నారాయణఖేడ్: మండల పరిధిలోని అంత్వార్‌కు చెందిన బీఆర్‌ఎస్ చెందిన నాయకుడు, సీనియర్ న్యాయవాది సంగమేశ్వర్‌రెడ్డితో పాటు గంగ్‌శెట్టి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా మండలంలోని మాణిక్‌నాయక్ తండాకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. జెడ్పీ ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు నగేశ్ షెట్కార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తితో ముక్తి

మునిపల్లి(అందోల్): భక్తితో ముక్తి పొందాలని నర్సాపూర్ మండలంలోని నృసింహపూరం ఆత్మానందాశ్రమ పీఠాధిపతి భగవద్భక్త పరాగ పూజ్య పాదరాజయోగి వెంకటస్వామి ఉపదేశించారు. ఆత్మానందాశ్రమంలో పీఠాధిపతి వెంకటస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు.

జహీరాబాద్‌లో కవాతు



జహీరాబాద్: పట్టణంలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు ఎన్నికల నేపథ్యంలో శనివారం కవాతు నిర్వహించారు. అల్లీపూర్, ఫయాజ్‌నగర్, పుగట్‌నగర్, మూసానగర్ కాలనీలతో పాటు చిన్న హైదరాబాద్ గ్రామంలో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ రాజు, ఎస్‌ఐ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

కాకతీయ బ్యాంక్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

సంగారెడ్డి: కాకతీయ బ్యాంక్ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సంగారెడ్డి బ్రాంచ్‌లో శనివారం సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధ్యక్షుడు నరసింహారెడ్డి, ఎండీ సంజీవరెడ్డి మాట్లాడారు. కాకతీయ బ్యాంకు స్థాపించిన నాటి నుంచి ఖాతాదారులకు సేవలందించడం గర్వంగా ఉందన్నారు. సిల్వర్ జూబ్లీ సందర్భంగా ప్రత్యేకంగా డిపాజిట్ స్కీంలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. లాకర్స్ సదుపాయం ఉందన్నారు. బ్యాంక్ మేనేజర్ జి.మొగులయ్య, ఖాతాదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలంలోని రామేశ్వరంబండ గ్రామానికి చెందిన మన్నే మల్లేష్(25) లేబర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన మల్లేష్ తిరిగి రాలేదు. దీంతో శుక్రవారం ఇంద్రేశం హెచ్‌పీ పెట్రోల్‌బంక్ సమీపంలోని కల్లు దుకాణం వద్ద మల్లేష్ మృతి చెంది కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులకు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతి చెందిన వ్యక్తి చేతులకు విద్యుత్ షాక్ తగిలిన గాయాలు ఉండటంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. శనివారం మృతుడి తండ్రి నాగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

జిన్నారం(పటాన్‌చెరు): కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన దోమడుగు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మాదాపూర్‌కు చెందిన సుగుణావత్ పరమేష్(27) భార్యతో కలిసి దోమడుగులో నివాసం ఉంటూ స్థానికంగా ఉన్న పరిశ్రమలో కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆరు నెలల నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన పరమేష్ ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తెగిపడిన 11కేవీ వైర్లు

నారాయణఖేడ్: ఖేడ్ జంట గ్రామం మంగల్‌పేట్‌లో చెరుకు తరలిస్తున్న లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో 11కేవీ విద్యుత్‌వైర్లు తెగి రోడ్డుపై పడ్డాయి. చెరుకు లారీలు ప్రతీ ఏడు విద్యుత్ స్తంభాలను ఢీకొనడం, వైర్లుతెగడం సర్వసాధారణంగా మారింది. బైపాస్ గుండా చెరుకు లారీలు వెళ్లకుండా ప్రధాన రహదారి గుండా వెళ్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాపోతున్నారు.

పతి తరఫున సతి ప్రచారం

జహీరాబాద్: బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాంచందర్ రాజనర్సింహ తరఫున ఆయన భార్య సుమిత్ర పట్టణంలోని పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలోనే కులవృత్తులకు జీవం

- అన్నివర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం
- బీఆర్‌ఎస్ విజయానికి కంకణబద్ధులై పనిచేయండి
- బీఆర్‌ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి


పటాన్‌చెరు: ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

పటాన్‌చెరు: బీఆర్‌ఎస్ పాలనలోనే కులవృత్తులకు జీవం పోయడం జరిగిందని ఆ పార్టీ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని ముదిరాజ్ భవన్‌లో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన ముదిరాజుల సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనానికి మహిపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉనికి కోల్పోతున్న కులవృత్తులకు సీఎం కేసీఆర్ జీవం పోశారన్నారు. ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి ముదిరాజుల సంక్షేమానికి పెద్దపీట వేశారని వివరించారు. మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కార్పొరేటర్ కుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ సపానదేవ్, శంకర్‌యాదవ్, నాగసాని మాణిక్యం, అఫ్జల్, నివర్తి, జగన్, రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

కాంగ్రెస్‌కు తెలంగాణలో స్థానంలేదని బీఆర్‌ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు తలారి మల్లేష్ తన అనుచరులతో కలిసి మహిపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ సునీతాసత్యనారాయణ, సర్పంచ్ కృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు ఈర్ల రాజు, నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి..

పటాన్‌చెరు టౌన్: అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను మరోసారి గెలిపిస్తాయని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సపన్‌దేవ్, అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అమీన్‌పూర్ పరిధిలోని పలు కాలనీలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్ గోపాల్, బీఆర్‌ఎస్ నాయకులు బాబులురెడ్డి, వెంకటరావు, రవి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని బలపరచండి

అభివృద్ధి, సంక్షేమాన్ని బలపరచాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. పటాన్‌చెరు మండల పరిధిలోని పాటి, కర్ధనూరు గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి రహిత పాలన అందిస్తున్న బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, ఎంపీపీ సుష్మశ్రీ వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ సుప్రజ, వైస్‌ఎంపీపీ స్వప్న, పార్టీ అధ్యక్షుడు పాండు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎమ్మెల్యేగా తనను మరోసారి గెలిపించి ఆశీర్వదించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అన్నారు. రామచంద్రాపురం పట్టణంలోని వర్తక సంఘం సభ్యులు ఆయనకు మద్దతు పలికారు. అనంతరం విద్యుత్‌నగర్ కాలనీలో మైనార్టీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. అదేవిధంగా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రేటెడ్ కమ్యూనిటీ కాలనీలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. వేర్వేరుగా నిర్వహించినకార్పొరేటర్ పుష్పనగేష్, తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత, వైస్‌చైర్మన్ రాములుగౌడ్, మాజీ రాష్ట్ర సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సోమిరెడ్డి, తెల్లాపూర్ నైబర్హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి

జిన్నారం(పటాన్‌చెరు): మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దువ్వగుంట, మాదారం, కొడకంచి, మంత్రికుంట, కొర్లకుంట, నల్తూరు, లక్ష్మీపతిగూడెం, చౌదరిగూడెం, వావిలాల, గడ్డపోతారం, అలీనగర్, కిష్టయ్యపల్లి, కాజిపల్లి తదితర కాలనీలలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలను చిత్తుగా ఓడించి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, సీనియర్ నాయకులు వెంకటేష్‌గౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు, పార్టీ మండల అధ్యక్షులు రాజేష్, గ్రామ కమిటీల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రామచంద్రాపురం: తెల్లాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి


పటాన్‌చెరు టౌన్: ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ కార్పొరేటర్ సపానదేవ్


జిన్నారం: మాదారం గ్రామంలో నిర్వహించిన రోడ్ షోలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400